సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 12 । అక్టోబర్ । 2024



శివారు ఇళ్లు..

శివారు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన బ్యాచ్ పోలీసులకు పట్టుబడింది. తండ్రీకొడుకులే నిందితులు.

- 6లో



ఆరు రీచ్‌లు.. ఏడు బిడ్‌లు

జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లకు ఏడు బిడ్లు వచ్చాయి. ఇది అధికార పార్టీ ఆడిన ఆట.

- 6లో

నవంబర్ మొదటి వారంలో డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూలో డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు నవంబర్ మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్ భాస్కర్ చెప్పారు. ఈ మేరకు ఆయన శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 20వ తేదీ లోపు పరీక్ష ఫీజులు చెల్లించాలని అన్నారు. ప్రయోగ పరీక్షలు ఈ నెల 29వ తేదీ నుంచి నవంబర్ రెండో తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

దసరాకు దూరం



నవరాత్రులకు నోచుకోని కొత్తూరు గ్రామం

కొత్తూరు: దేశం మొత్తం దసరా సరదాలో ఉంటే కొత్తూరులో మాత్రం దేవీ నవరాత్రులు జరుపుకోరు. దాదాపు వందేళ్లుగా వీరు దసరా జరుపుకోవడం లేదు. వందేళ్ల కిందట దసరాలో మేకను బలి ఇస్తున్నప్పుడు పొరపాటున ఓ వ్యక్తిపైకి కత్తి వెళ్లి ఆయన చనిపోవడంతో అప్పటి నుంచి నవరాత్రులు చేయడం మానేశారు. 1985లో ఓసారి అప్పటి యువకులంతా దేవీ నవరాత్రులు చేయడానికి ప్రయత్నిస్తే బాణసంచా పేలి ఒకరికి గాయాలయ్యాయి. దీంతో దసరా ఉత్సవాలకు దూరంగా ఉండిపోయారు. దసరా అనే కాదు.. గ్రామదేవతలకు చల్లదనం, పత్రి పూజలు చేయడం కూడా ఆపేశారు. విజయదశమి రోజు మాత్రం వాహనాలకు పూజలు చేస్తారు.

అల్లర్లకు పాల్పడవద్దు: ఎస్పీ



ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ప్రజలకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. పల్లెల్లో అమ్మవారికి కొమ్ములు వేసే సమయంలో వర్గాలుగా వీడి కొట్లాటకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల వారీగా, పట్టణాల వారీగా ఇప్పటికే తమ పోలీసుల వద్ద ఎవరెవరు అల్లర్లకు పాల్పడతారో వారి లిస్టు ఉందని, అలాంటివారిపై పూర్తి నిఘా పెట్టి ఉంచామన్నారు.

వినియోగంలోనికి వచ్చిన స్కానింగ్ పరికరం



సాక్షి ఎఫెక్ట్...

స్కానింగ్ మిషన్

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో స్కానింగ్ మిషన్ ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చింది. గురువారం సాయంత్రం సంబంధిత ఇంజినీరింగ్ ప్రతినిధి వచ్చి స్కానింగ్ మిషన్ మరమ్మతు చేశారు. శుక్రవారం నుంచి వినియోగిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు తెలిపారు. 'ఆస్పత్రిలో పనిచేయని స్కానింగ్ మిషన్' అన్న శీర్షికతో సాక్షిలో గురువారం వార్త రావడంతో అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు చేశారు.

• అయి గిరి నందిని

శిరసుపై మోసిన పసుపు నీళ్ల కలశాలు.. మండపాలకు కట్టిన వేప మండలు.. పల్లె నుదుట అద్దిన పసుపు కుంకుమలు ఊరికి నవరాత్రి శోభను తీసుకువచ్చాయి. తొమ్మిది రూపాల్లో అమ్మను అలంకరించాక తీరున్నొక్క రీతిలో అర్చనలు జరిగాయి. నవ రాత్రులు గడిచి విజయ దశమి పర్వదినం రానే వచ్చింది. మండపాల నుంచి తల్లి బయటకు వచ్చే వేళయ్యింది. విజయ దశమి ఘడియల్లో శక్తి స్వరూపిణిగా భక్త జనానికి దర్శనమివ్వనుంది. దసరా వేళ ఊరూవాడా నచ్చిన రీతిలో అమ్మవారిని కొలిచి సంబరం చేసుకుంటున్నాయి. అయి గిరి నందిని.. అంటూ అమ్మకు ఇష్టమైన పాట పాడుతున్నాయి.



శ్రీకాకుళం కల్చరల్: మహిషాసుర మర్దినిగా విజయదుర్గమ్మ



ఇచ్ఛాపురం: సిద్ధిదాయినిగా స్వేచ్ఛావతి అమ్మవారు



పాతపట్నం: ప్రత్యేక అలంకరణలో నీలమణి దుర్గ



టెక్కలి: పాత బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహం

• దీపాల కాంతుల్లో..



దసరా ముందు రోజు పొందూరు దీప కాంతులతో మెరిసిపోయింది. కంచికామాక్షి ఆలయంలో భక్తితో దీపారాధన చేశారు.
- పొందూరు

• స్వర్ణ కుసుమాలతో..



పలాస కన్యకాపరమేశ్వరి ఆలయంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 108 బంగారు పుష్పాలను అలంకరించారు. వీటి విలువ రూ.20 లక్షలు ఉంటుంది.
- కాశీబుగ్గ

• పరివార దేవతల ప్రతిష్టాపనలో..



స్థానిక గోవిందనగర్ కాలనీలోని రాజరాజేశ్వరీ దేవాలయంలో మహాలక్ష్మి, మహాసరస్వతి సమేత పరివార దేవతల ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట, దర్పణ దర్శనం, సర్వదర్శనాలు జరిగాయి.
- శ్రీకాకుళం కల్చరల్



సముద్రపు ఒడ్డున దీవిలో ఏర్పాటు చేసిన చిన్ననీలావతి గ్రామ దేవత కాలమ్మ ఆలయం



• ఉపాధి కోసం వెళ్లి ఊళ్లు నిర్మించుకున్న ఉద్దానం వాసులు • ఇక్కడి జ్ఞాపకాలు వదల్లేక అండమాన్‌లో ఆలయాల నిర్మాణం • వేడుకగా దసరా ఉత్సవాలు

కాశీబుగ్గ:

ఉపాధి కోసం ఊరిని విడిచిపెట్టారు. కానీ ఊరు వారిని విడిచిపెట్టలేదు. పండగలు, శుభ కార్యాలు, స్నేహితులు హడావుడి ఎప్పటికప్పుడు వారికి గుర్తుకు వస్తుండేవి. ఆ జ్ఞాపకాలు వారందరినీ ఒక్కటి చేశాయి. అండమాన్‌లో చిన్నపాటి ఉద్దానంను నిర్మించేలా పురిగొల్పాయి. అంతా కలిసి చిన్నపాటి గ్రామంగా ఏర్పడి ఇక్కడి మా దిరిగానే ఆలయాలు కట్టుకున్నారు. ఊరిలో చేసినట్టుగానే పూజలు, ఉత్సవాలు అక్కడా చేస్తున్నారు.

ఊరినే నిర్మించుకున్నారు..

ఉద్దాన ప్రాంతమైన పలాస మండలం చిన్ననీలావతి గ్రామం అనేది తూర్పున బంగాళాఖాతం సముద్ర తీరానికి పది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 150 ఇళ్లతో సుమారు 500 మంది ఇక్కడ ఉంటారు. ఈ పల్లెకు చెందిన వారు 1978 నుంచి 1980 మధ్య కాలంలో విశాఖ నుంచి పడవల్లో అండమాన్‌కు వలస వెళ్లారు. అక్కడే ఉపాధి, ఉద్యోగాలు పొంది స్థిరపడ్డారు. సొంత ఊరిని, అయిన వాళ్లని చూసేందుకు ఏడాదికోమారు వస్తుంటారు. కానీ ఊరి జ్ఞాపకాలు వారిని ఊరుకోనిచ్చేవి కావు. ఏడాదికోమారు వచ్చినా సొంతూరిలో ఉండలేక పోయామనే బాధ వారిని వెంటాడేది. దీంతో సముద్రపు దీవిలో కొండకు సమీపంలో చిన్ననీలావతి అని బోర్డులు పెట్టుకుని అభ్యుదయ యువజన సంఘం ఏర్పాటు చేసుకున్నారు. 1985లోనే దాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. అండమాన్-నికోబార్ ఐలాండ్‌లో పోర్టు బ్లెయిర్ ప్రాంతం (శ్రీవిజయపురి)లో ఈ గ్రామం ఉంది. ఈ గ్రామంలో 35 ఇళ్లు కట్టుకుని చిన్ననీలావతి గ్రామంగా కాళీమాత దేవాలయాన్ని నిర్మించుకున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సుమారు వెయ్యి మందితో దసరా వేడుకలు చేసుకుంటూ ఉంటారు. ఉద్దాన ప్రాంతంలో ఉన్న ఏడు మండలాల ప్రజల అంతా కలిసి ఇక్కడ పండగలు చేసుకుంటూ ఊరిని గుర్తు చేసుకుంటూ ఉంటారు.



దసరా ఉత్సవాలలో గ్రామస్తులు



అండమాన్‌లో దసరా ఉత్సవాల ఊరేగింపులో నీలావతి గ్రామస్తులు

ఆంధ్రా అసోసియేషన్‌లో లక్షమంది సభ్యులు

అండమాన్, నికోబార్ దీవిలో దాదాపు 4.34 లక్షల మంది జీవిస్తుంటే అందులో 40% మంది మన తెలుగువారే. తెలుగువారంతా ఐక్యంగా ఉండాలని ఆంధ్రా అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా ప్రత్యేకంగా నిర్వహించే ఉత్సవాలకు అంతా ఒక్కటిగా చేరి సంబరాలు చేసుకుంటారు.

నలభై ఏళ్ల కిందట వచ్చేశాం..



మా ఆయన అండమాన్ సముద్ర తీరంలో ఉన్న కర్రల మిల్లులో పనిచేసేవారు. నలభై ఏళ్ల కిందట మేమూ అండమాన్ వచ్చేశాం. మా గ్రామంపై ఉన్న మమకారంతో ఇక్కడ ఓ ఊరు నిర్మించుకున్నాం. అన్ని రకాలు పండగలు జరుపుకుంటున్నాము.
- సొర్ర పార్వతి, చిన్ననీలావతి గ్రామం, బోంటేప్లాట్ (అండమాన్)

సొంతూరు గుర్తుకు వస్తుంటుంది



మేమెప్పుడో ఉపాధి కోసం అండమాన్ వచ్చేశాం. ఇక్కడే చదువులు, ఇక్కడే శుభకార్యాలు జరుపుకుంటున్నాము. అనేక మంది మున్సిపాలిటీలో, ఫారెస్టులో, విద్యుత్‌శాఖలో, అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సైతం ప్రభుత్వ ఉద్యోగాలు పొంది స్థిరపడి పోయారు. ఊళ్లను వదిలిపెట్టామనే బాధతోనే ఇక్కడ అచ్చం మా ఊరిలో ఉన్నట్టు ఇళ్లు కట్టుకుని బతుకుతున్నాం. ఎప్పటికప్పుడు మా సొంతూళ్లు గుర్తుకు వస్తుంటాయి. - జుత్తు అప్పలస్వామి, చిన్ననీలావతి కులపెద్ద, సోర్ పాయింట్, అండమాన్

కొండెక్కిన నాటుకోడి

హిరమండలం: దసరా వేళ నాటుకోడి కొండెక్కి కూర్చుంది. కిలో బరువు తూగే కోడిపుంజు రూ.700 పైమాటే పలుకుతుండగా కోడిపెట్ట ధర రూ.600 పలుకుతోంది. అయినా కొనుగోలుకే జనం మొగ్గు చూపుతుండటంతో ఇట్టే అమ్ముడైపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం నాటుకోడి ధరలు విపరీతంగా పెరిగాయి. వాహనం ఉన్న ప్రతి ఒక్కరితో పాటు ప్రతి ఇంటి వారు పూజలు, మాంసాహారం కోసం వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుండటం విశేషం.

చికెన్..చాలా రేటు గురూ!

• విశాఖ, విజయనగరం కంటే శ్రీకాకుళంలోనే అత్యధికం
• సిండికేట్ చేతిలో చికెన్ ధరలు • అమ్మలేమంటున్న రిటైల్ వ్యాపారులు
• కష్టంగా మారిన హోటల్స్, హాస్టల్స్ నిర్వహణ







శ్రీకాకుళం/(పీఎన్ కాలనీ): సిండికేట్ల చేతిలో పడి చికెన్ ధరలు అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నాయి. కూరగాయలు, ఆయిల్, నిత్యావసర సరుకుల ధరలు నిర్ణయించే అధికారం కలెక్టర్, మార్కెటింగ్‌శాఖ అధికారుల చేతుల్లో ఉంటుంది. చికెన్ ధరలు మాత్రం హోల్‌సేల్ చికెన్ వ్యాపారులు, వారి సిండికేట్ వారే రేట్లు 'ఫిక్స్' చేస్తారు. విశాఖపట్నం, విజయనగరంలో ఒక రేటు ఉంటే శ్రీకాకుళంలో మాత్రమే ఈ రెండు జిల్లాలకంటే రూ.20 ఎక్కువ ఉంటుంది. ఎందుకు ఎక్కువ అంటే ఎవరూ సమాధానం చెప్పలేరు. ఫారాలకు జిల్లాలోనే ఫీడ్ దొరుకుతుంది, కోళ్ల ఫారాలు సైతం జిల్లాలోనే ఉన్నాయి. జిల్లాకు సరిపడా సరుకు లేకుంటే విశాఖ, అనకాపల్లి నుంచి తీసుకువస్తారు. కానీ ధరలు మాత్రం విశాఖ, విజయనగరం కంటే ఎక్కువే ఉంటున్నాయి. ఈ సిండికేట్‌లో త్రిమూర్తుల్లా ముగ్గురు వ్యక్తులు ఈ వ్యవహారమంతా నడిపిస్తోన్నట్లు చికెన్ షాపుల యజమానులు గుసగుసలాడుకుంటున్నారు.

గత నాలుగు నెలలుగా స్కిన్‌లెస్ సుమారు రూ.260కి పైగా ధర పలుకుతోంది. విశాఖపట్నం, విజయనగరంలో రూ.240కి అమ్ముతున్నారు. ఇవి పత్రికల్లో వచ్చే ధరలు. చికెన్‌షాపుల యజమానుల వారి వ్యాపారాన్ని బట్టి ధర తగ్గించి అమ్మేవారు కొందరు, మరికొంతమంది దానికంటే ఎక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ/ప్రవేటు హాస్టల్స్, హోటల్స్, దాబాల నిర్వాహకులు కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా తర్వాత ఆదివారం ఇంకెంత ధర పెంచేస్తారోనని ఆందోళన చెందుతున్నారు.

ఒడిశా నుంచి కొని..

జిల్లాలోని పలువురు వ్యాపారులు ఒడిశా నుంచి కోళ్లను తక్కువ ధరకు తీసుకువస్తున్నారు. జిల్లాలో కంటే ఒడిశాలో ధర కిలోకు రూ.40వరకు తక్కువగానే ఉంటుంది. తక్కువ ధరకు కొనుగోలు చేసి జిల్లాలో వ్యాపారులు, సిండికేటుగాళ్లు ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. విశాఖ, విజయనగరం జిల్లాల కంటే తక్కువ ధరకు ఇవ్వాల్సింది పోయి తిరిగి దూర ప్రాంతాల నుంచి తెస్తున్నామనే నెపంతో ధరలు అధికంగా పెంచేసి రెట్టింపు లాభాల్ని ఆర్జిస్తున్నారు. ధరల నియంత్రణపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ధరలు నియంత్రించాల్సిందే



చికెన్ ధరల నియంత్రణ అధికారుల చేతుల్లో ఉంటే బాగుంటుంది. హోల్‌సేల్ వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన ధరకు విక్రయిస్తున్నారు.
- ప్రకాష్, చికెన్‌షాపు, రైతుబజారు రోడ్డు, శ్రీకాకుళం.

వ్యాపారాలు చేయలేకపోతున్నాం




చికెన్ ధరలను ఇష్టం వచ్చినట్లు పెంచుకుంటూ పోతున్నారు. చికెన్, గుడ్లు ధరలు పెంచడంతో దాబాకి వచ్చేవారికి అధిక ధరలకు ఆహారాన్ని అమ్మలేకపోతున్నాం నష్టాన్ని భరించలేకపోతున్నాం.
- ఎం.నాగభూషణ్, శ్రీలక్ష్మిదుర్గా దాబా, బలగరోడ్

ధరల నియంత్రణ మా చేతుల్లో లేదు

చికెన్, గుడ్ల ధరల నియంత్రణ మా చేతుల్లో ఉండదు. వాటి సంరక్షణ, పోషణకు సంబంధించిన ప్రోత్సాహమంతా పశు సంవర్ధక శాఖ నుంచి ఉంటుంది. ధరల నియంత్రణకు జిల్లాలో సంబంధిత ప్రభుత్వ శాఖలతో కూడిన కమిటీ వేస్తే నియంత్రణ సాధ్యమయ్యే అవకాశం ఉంటుంది.
- రావిపల్లి మురళీధర్, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు

ఊరికో తీరున..



బీహార్‌లో ఏర్పాటు చేసిన అతిపెద్ద మండపం (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: దేశమంతా దసరా వేడుకల్లో మునిగితేలుతోంది. జిల్లా కేంద్రంలో ఇతర ప్రాంతాలకు చెందిన వారు కొందరు స్థిరపడ్డారు. ఇక్కడి పద్ధతికి అలవాటు పడుతూనే.. తమ సొంత ప్రాంతాల్లో దసరా వేడుక చేసుకునే తీరును వారు 'సాక్షి'కి వివరించారు.



బీహార్‌లో మహిషాసుర మర్దిని, దుర్గా, సరస్వతి, గణేష్ బొమ్మలు (ఫైల్)

రాజస్థాన్: ఇక్కడ దసరాకు ఆంధ్రాలో ఇచ్చిన ప్రాధాన్యత ఉండదు. ఈ పండగ సమయంలో దాండియా నృత్యాలు చేస్తారు.

మహారాష్ట్ర: ఇక్కడ 10 రోజుల పాటు పండుగ జరుపుతారు. అయితే దుర్గా దేవి పూజలు చేస్తూ అంతా ఉపవాసాలు ఉంటారు. అలాగే రాత్రంతా రామాయణం, రామలీలాపై నృత్యాలు చేస్తారు. ఆఖరి రోజున రావణాసురుడు, కుంభకర్ణుడు, మేఘనాథుడి దిష్టి బొమ్మలను సుమారుగా 40 లేదా 50 అడుగుల ఎత్తుగలవి దీపావళి టపాసులతో తయారు చేసి ఊరికి దూరంగా పెద్ద మైదానంలో ఉంచుతారు. అక్కడి లక్షలాది మంది జనాలు చేరాక రాముడు తన బాణంతో సంహరించినట్లుగా బాణంతో ఆ బొమ్మలను కాల్చుతారు. రావణుడిపై రాముడి విజయంగా భావించి విజయదశమిగా అక్కడ నమ్ముతారు.

కేరళ: కేరళలో దసరాకు సరస్వతీ మాతను ఆరాధిస్తారు. బలులు ఉండవు. అంతా సామరస్యంగా సాగుతాయి. రోజుకో అవతారంలో అలంకరించి కుంకుమ పూజలు నిర్వహిస్తారు.

ఒడిశా: దసరా సమయంలో కటక్, బరంపూర్‌లో సుమారు 200 వరకు మండపాలు (పెండాల) ఏర్పాటు చేస్తారు. ప్రతి ఇంటిలో నిష్ఠగా పూజలు జరుగుతాయి. వివిధ వేషధారణ బొమ్మలను ప్రతి ప్రదేశంలో ఏర్పాటు చేస్తారు. వాటిని చూసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి తండోపతండాలుగా వస్తుంటారు.

దసరాకు ఎంతో ప్రాధాన్యం



పశ్చిమ బెంగాల్ తర్వాత ఒడిశాలో దసరా బాగా చేస్తారు. ప్రతి వీధిలో మండపాలు ఏర్పాటు చేస్తారు. ఊరంతా సందడిగా ఉంటుంది.
- నరసింహ పాణిగ్రహి పండా, ఒడిశా రాష్ట్రం (శ్రీకాకుళం)

ఆహార నియమాలు ఉండవు



దసరా పండుగకు ఇక్కడ ఉన్నట్లుగా ఆహార నియమాలు మా ఊరిలో ఉండవు. నా చిన్నతనంలో మా గ్రామానికి దగ్గరగా ఉన్న మా తాతగారి ఊరైన రాంచీ వెళ్లి చూసే వాళ్లం. అక్కడ 200 మండపాలు (పెండాల్స్) అతి పెద్దవి ఏర్పాటు చేస్తారు. పెద్ద మైదానంలో ఒక ఎగ్జిబిషన్ మాదిరిగా పెడతారు. వాటి చూసేందుకు సాయంత్రం బయలు దేరితే రాత్రి ఒంటిగంట వరకు తిరిగేవాళ్లం. ఆఖరి రోజున పెద్ద మైదానంలో రావణ సంహారం పెడతారు. చిన్నారులకు రామలక్ష్మణ వేషధారణలు వేస్తారు.
- డాక్టర్ వికస్(జార్ఖండ్), రాగోలు

భారీ డెకరేషన్స్ చేస్తారు



బీహార్‌లో భారీగా డెకరేషన్స్ చేస్తారు. మండపాల్లో మహిషాసుర మర్దని, దుర్గాదేవి, గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి రోజు సాయంత్రం అమ్మవారికి ధూపం హారతి ఇస్తారు. ఆ సమయంలో డప్పుల మోతలు ఉంటాయి.
- మధిర భాస్కర్ (బీహార్), బలగ

ఆంధ్రాలో బాగా జరుగుతాయి



తమిళనాడులో దీపావళి, పొంగల్ బాగా జరుపుతాం. దసరాలో సరస్వతీ పూజలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తాము.
- సుబ్రహ్మణ్య కదిరేశన్ తమిళనాడు

క్లుప్తంగా

ముమ్మరంగా స్వల్పకాలిక వరిచేను కోతలు



బసవరాజుపేట వద్ద వరిచేను కోతలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని వంశధార నదీ తీర గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన స్వల్ప కాలిక వరిచేను కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని లక్ష్మీనర్సుపేట, వాడవలస, మిరియాపల్లి, బసవరాజుపేట, సీతారాంపురం, దబ్బపాడు, స్కాట్‌పేట, మోదుగువలస తదితర వంశధార నదీతీర రెవెన్యూ గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో స్వల్పకాలిక వరి పంట వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి పైడి లతశ్రీ తెలిపారు.

అంతిమ యాత్రకు అవస్థలు



పంటపొలాల మధ్య లోంచి మృతదేహాన్ని తీసుకువెళ్తున్న గ్రామస్తులు

టెక్కలి రూరల్: లచ్చన్నపేట గ్రామంలోని శ్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన మార్గంలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం ఆ గ్రామానికి చెందిన మహాలక్ష్మి అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పార్థివ దేహాన్ని తీసుకెళ్లేందుకు గ్రామస్తులు పంటపొలాల మధ్య ఇబ్బందులు పడ్డారు.

నాటుసారాతో 10 మంది అరెస్ట్

పాతపట్నం: పాతపట్నం అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆటోలో పాతపట్నంకు చెందిన నలుగు వ్యక్తులు నాలుగు లీటర్ల నాటు సారాతో ఒడిశా నుంచి పాతపట్నం వస్తుండగా చెక్‌పోస్ట్‌లో పోలీసులు పట్టుకున్నారు. అలాగే లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు 15 లీటర్ల సారా ఒడిశా నుంచి తీసుకు వస్తుండగా పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఒక ఆటోను సీజ్ చేశామని, 19 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 10 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

మద్యం దుకాణాలకు 4594 దరఖాస్తులు

- అర్ధరాత్రి వరకూ ఆన్‌లైన్‌లో అవకాశం ఉండడంతో పెరిగే అవకాశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ అధికారి తిరుపతినాయుడు

శ్రీకాకుళం క్రైం: మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో పూర్తికావడంతో జిల్లా వ్యాప్తంగా 4,594 దరఖాస్తులు చేరినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు పేర్కొన్నారు. అర్ధరాత్రి వరకూ ఆన్‌లైన్‌లో అవకాశం ఉండడంతో ఈ దరఖాస్తులు మరింతగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ పాల్గొన్నారు. దరఖాస్తుదారులు ఈ నెల 14న ఉదయం 7గంటలకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఆడిటోరియం వద్దకు హాజరుకావాలని, 8 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. గెజిట్ సీరియల్ ఆధారంగా డ్రా తీస్తారని పేర్కొన్నారు.

స్టేషన్ వారీగా వచ్చిన దరఖాస్తులు..
శ్రీకాకుళం 1061(32), ఆమదాలవలస 367(13), రణస్థలం 662(15), పొందూరు 353(10), నరసన్నపేట 285(12), కొత్తూరు 205(7), పాతపట్నం 236(8), టెక్కలి 293(11), కోటబొమ్మాళి 339(15), పలాస 234(15), సోంపేట 313(12), ఇచ్ఛాపురం 246(8).

ఆరు రీచ్‌లు.. ఏడు బిడ్‌లు



- జిల్లాలో ముగిసిన సీల్డు టెండర్లు
- జిల్లాలో ఆరు రీచ్‌లకు ఏడే బిడ్లు దాఖలు
- అధికార కూటమి నేతలకు దక్కేలా వ్యూహరచన

అరసవల్లి:

జిల్లాలో ఇసుక తవ్వి తీసుకెళ్లేందుకు అధికార కూటమి నేతల ఎత్తులు.. ఒత్తిళ్లు బాగా పని చేశాయి. ఫలితంగా శుక్రవారంతో పూర్తయిన ఇసుక రీచ్‌ల టెండర్లు మొత్తం వన్‌సైడ్ అయిపోయింది. జిల్లాలో ఆరు రీచ్‌లకు గాను నిర్వహించిన సీల్డు టెండర్ల ప్రక్రియలో మొత్తం ఏడుగురే బిడ్లు దాఖలు చేశారు. ఇందుకు పూర్తిగా అధికారులు పూర్తిగా సహకరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆరు రీచ్‌లకు ఏడే బిడ్లు
జిల్లాలో బూరవిల్లి (గార), అంబల్లవలస (గార), బట్టేరు (శ్రీకాకుళం), హయాతినగరం (శ్రీకాకుళం), గోపాలపెంట (నరసన్నపేట), నివగాం (కొత్తూరు) తదితర ఆరు చోట్ల ఇసుక రీచ్‌లను గుర్తించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ.. స్థానిక భూగర్భ గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం వేదికగా సీల్డు టెండర్లను ఆహ్వానించింది. అయితే ఈమేరకు ఈనెల 8 నుంచి 11వ తేదీ ఉదయం 11 గంటల్లోగానే బిడ్లు దాఖలు చేసుకునే అనుమతిచ్చింది. అయితే శుక్రవారం ఉదయం 11 గంటలకు ముందే ఎవరికి ఏ రీచ్ దక్కిందో కూడా ప్రచారాల్లోకి వచ్చేశాయంటే పరిస్థితులు ఎంత ఏకపక్షమో అర్థం చేసుకోవచ్చు. కేవలం ఆరు రీచ్‌లకు కేవలం ఏడు బిడ్లు మాత్రమే దాఖలు కావడంతో నివగాం మినహా మిగిలిన ఐదు రీచ్‌లకు ఒక్కొక్కటే బిడ్ దాఖలు కావడంతో టెండర్ వేసిన వారికే ఇసుక రీచ్ దక్కినట్లవుతోంది. పాతపట్నం నియోజకవర్గంలో ఇసుక కోసం ఎంతకైనా తెగించే పరిస్థితుల్లో అటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, ఇటు ప్రస్తుత ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఇద్దరూ ఉన్నారు. ఈ క్రమంలో నివగాంలోనే రెండు బిడ్లు దాఖలైనట్లుగా ప్రచారం జరుగుతోంది.

మెట్రిక్ టన్ను ధర నిర్ణయంలోనే కుట్ర
జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇసుక రీచ్‌ల్లో మెట్రిక్ టన్ను ఇసుక ధర రూ.110 గా నిర్ణయించడంలోనే అసలు వ్యూహం దాగుంది. వాస్తవానికి రీచ్‌లో ఇసుకను తవ్వి స్టాక్ పాయింట్ వద్దకు తీసుకురావడం అనేది ఇంత తక్కువ ఖర్చులతో సాధ్యం కాదనేది అందరికీ తెలిసిందే. అయితే వాస్తవంగా ఇలా చేయాలంటే రవాణా చార్జీలతో సహా టన్నుకు రూ.330 వరకు ఖర్చు అవుతుందనేలా అనుభవజ్ఞులు చెబుతున్నారు. అయితే ఇంత తక్కువ ధర నిర్ణయించడంతోనే అధికార కూటమి నేతలకు రీచ్‌లు దక్కే అవకాశాలు ఎక్కువయ్యాయనే వాదన వినిపిస్తోంది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వ్యక్తులు, వ్యాపారాలు, అలాగే తటస్థ వ్యాపారులు దాదాపుగా టెండర్లు దాఖలు చేసే ధైర్యం చేయరు. అలా చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ఇసుకను తోడుకుని వెళ్లే పరిస్థితులు అంత ఆషామాషీ కాదు. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువకే కోట్ చేసినప్పటికీ ఎలాగైనా అధికారంలో ఉన్న నేపథ్యంలో ఇసుకను అక్రమంగా రవాణా చేయించుకునే వెసలుబాటు ఒక్క అధికార పార్టీ కార్యకర్తలు, నేతలకే ఉంటుంది. రెవె న్యూ, పోలీస్, మైన్స్ అధికారులంతా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఉంటున్న నేపథ్యంలో అక్రమాలకు తెరతీసేలా టెండర్లు దక్కించుకోనున్న నేతలు అడుగులు వేస్తున్నారు. ఇదే క్రమంలో మరోవ్వరూ పోటీలో ఉండే అవకాశం లేకుండా ఇసుక రీచ్‌లను అధికార పార్టీ నేతలు దక్కించుకున్నట్లుగా తెలుస్తోంది.

నోరెత్తని అధికారులు
జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఉండాలి కాబట్టి ఉంది, అందులో అధికారులు ఏదో విధులు నిర్వర్తించాలి కాబట్టి నిర్వహిస్తున్నారు.. అనే రీతిలో ఉంది తాజా ఇసుక రీచ్‌ల సీల్డు టెండర్ల ప్రక్రియ. శుక్రవారంతో టెండర్ల ప్రక్రియ ముగిసినప్పటికీ ఎలాంటి వివరాలను బయటపెట్టేందుకు అధికారులు ఇష్టపడలేదు. దాదాపుగా అందుబాటులో లేకుండా పోయారు. దసరా పండుగ నేపథ్యంలో ఫోన్లకు కూడా దొరక్కుండా జాగ్రత్త పడ్డారు. అయితే ఇసుక రీచ్‌లకు సీల్డు టెండర్లు కాబట్టి ఎన్ని పడ్డాయో మేం చెప్పలేమంటూ సమాధానం దాటవేస్తున్నారు.

జిల్లా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



దయాలసిస్ రోగితో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణమూర్తి

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రిని ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ వివరాలు అడిగి వైద్యుల గదులను పరిశీలించారు. లంచాలేమైనా తీసుకుంటున్నారా అని రోగులను ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రిలో మరుగుదొడ్లు పరిశీలించారు. సంతబొమ్మాళి గ్రామానికి చెందిన సాకిపల్లి రామారావు అనే వ్యక్తి డయాలసిస్ అందక ఇబ్బంది పడుతుంటే ఆయనతో మాట్లాడారు. గురువారం నుంచి ఇబ్బంది పడుతున్నానని ఆయన చెప్పడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి వైద్యం చేయించే ఏర్పాట్లు చేశారు. ఫార్మశీని, ఎస్ఎన్‌సీయూ యూనిట్‌ను పరిశీలించారు. గురండి గ్రామానికి చెందిన సావిత్రి అనే మహిళ రక్త పరీక్షలకు చాలా సమయం పడుతోందని ఆయనకు చెప్పారు. కూర్చునేందుకు కుర్చీలు సైతం లేవని, కనీసం ఫ్యాన్లు లేక ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. దీంతో ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన డెంగీ ల్యాబ్ రికార్డులు పరిశీలించారు. బ్లడ్‌బ్యాంక్‌లో పూర్తిస్థాయిలో అన్నిగ్రూపులకు సంబంధించి రక్తం అందుబాటులో ఉండాలని సూచించారు.

బాలికలే ఏలికలు: జేసీ

శ్రీకాకుళం అర్బన్:

బాలికలు విద్యావంతులుగా ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళంలోని ఐసీడీఎస్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఇటీవల కాలంలో వారిదే పైచేయి అవుతుండడం హర్షణీయమన్నారు. క్రీడలు, చదువు తదితర అంశాల్లో రాణిస్తుండడం గర్వకారణమని పేర్కొన్నారు. అయితే కొన్ని కుటుంబాల్లో ఇప్పటికీ బాలకలపై చిన్నచూపు చూ స్తుండడం సరికాదన్నారు. ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ బాలికలు ఉన్నతంగా చదువుకొని దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలను కాపాడుకుందాం పేరుతో ఉన్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను సన్మానించి సర్టిఫికెట్లను అందజేశారు. తొలుత అంతర్జాతీయ బాలికల దినోత్స వం పురస్కరించుకొని డే అండ్ నైట్ నుంచి వైఎస్సార్ కూడలి వరకూ నిర్వహించిన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ప్రారంభించగా శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష, డీఎస్‌డీఓ శ్రీధర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, డీపీఆర్ఓ చెన్నకేశవరావు, ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్

ఐసీడీఎస్ ప్రాజెక్టులకు ప్రశంసలు
శ్రీకాకుళం అర్బన్: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పలు ఐసీడీఎస్ ప్రాజెక్టులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అభినందించారు. శ్రీకాకుళంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పీడీ బి.శాంతిశ్రీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కర్రసాములో విశేష ప్రతిభ కనబరిచిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 5వ తరగతి విద్యార్థిని నేతింటి శర్మిషను ప్రత్యేకంగా ప్రశంసించారు. వైఎస్సార్ కూడలి వద్ద బాలికలు నిర్వహించిన మానవహారం మధ్యలో ఆమె చేసిన కర్రసాము ఆత్మ రక్షణ విద్యను అందరూ నేర్చుకోవాలన్నారు. అలాగే బాలికల ప్రతిభను వెలికి తీసే కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించిన ఐసీడీఎస్ ప్రాజెక్టు కోటబొమ్మాళి (అన్నమయ్య సంకీర్తనలు), శ్రీకాకుళం (యోగ), రణస్థలం (పిల్లలతో వేషధారణ), ఆమదాలవలస (పిల్లల కథలు వర్ణించడం), శ్రీకాకుళం అర్బన్ (స్కూల్ కార్యక్రమాలు), నరసన్నపేట (కోలాటం) ప్రాజెక్టులను అభినందించారు.

మరో నలుగురు అరెస్టు

నరసన్నపేట: పోలాకి మండలం వనవిష్ణుపురంలో పాలిన వీరస్వామి హత్య కేసులో శుక్రవారం మరో నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాస రావు తెలిపారు. ఇప్పటికే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని, తాజాగా నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఎ–6గా తలగిన రాజు, ఎ–7 నూనెల తిరుపతిరావు, ఎ–8 తలగాన లచ్చయ్య, ఎ–10 తలగాన రమేష్‌లను అరెస్టు చేశామన్నారు. వీరికి మెజిస్ట్రేట్ హరిప్రియ 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమా..?



పొన్నాడ రుషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సరైన సదుపాయాలు కల్పించడం లేదని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హాస్టల్స్ నిర్వహణ చేస్తున్న కాంట్రాక్టులు, వార్డెన్లకు బిల్లులివ్వకపోవడం దారుణమన్నారు. వారంతా అప్పు చేసి హాస్టల్స్ నిర్వహిస్తున్నారని, వారిపై అప్పుల భారం పెరుగుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచిందని, బడులు బాగు చేయడం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇంగ్లిష్ మీడియం, అమ్మ ఒడి వంటి సంస్కరణలు తీసుకువచ్చిందని గుర్తుచేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు.

లోయలో పడిన కారు



లోయలో పడిన కారు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద కెనరా బ్యాంకు సిబ్బంది ప్రయాణిస్తున్న కారు శుక్రవారం బోల్తా పడింది. బ్యాంకు సిబ్బంది శ్రీకాకుళం నుంచి కారులో వస్తుండగా పాఠశాల వద్దకు వచ్చినప్పుడు అదుపు తప్పి సుమారు పాతిక అడుగుల లోయలో బండి పడిపోయింది. దీంతో స్థానికులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే అదృష్టవశాత్తు అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తూర్పుకాపులకు సముచిత స్థానం కల్పించాలి



మీసాల వెంకట రామకృష్ణ

హిరమండలం: జిల్లాలో తూర్పుకాపు సామాజిక వర్గానికి సముచిత స్థానాన్ని ఇవ్వాలని రాష్ట్ర తూర్పుకాపు సంక్షేమ సంఘం వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కులాన్ని ఓట్ల కోసం వాడుకుంటున్నారు తప్ప పదవులు ఇవ్వడం లేదని విమర్శించారు. తూర్పు కాపు నాయకులకు ప్రాధాన్యత ఇస్తే సామాజిక వర్గమంతా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

శివారు ఇళ్లు.. వృద్ధ మహిళలే టార్గెట్

- చైన్ స్నాచింగ్ బ్యాచ్‌ను పట్టుకున్న పోలీసులు
- కాశీబుగ్గ, సోంపేట చోరీల్లో పాల్గొన్న నలుగురు అరెస్టు
- కీలక నిందితుడు ఓ మాజీ సైనికుడు
- రెక్కీ చేసేది అతని తండ్రి
- 11 తులాల బంగారం స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ :

మారుమూల ప్రాంతాల్లో ఉండే ఇల్లు.. వృద్ధ మహిళలే వారి టార్గెట్. పక్కాగా రెక్కీ చేయడం, మెడలో వస్తువులను తెంపేసి పారిపోవడం ఈ బ్యాచ్ పద్ధతి. సీసీ కెమెరాల కంట పడకుండా తప్పించుకోవడంలో వీరు సిద్ధహస్తులు. కాశీబుగ్గ, సోంపేటలో బంగారు గొలుసుల దొంగనాలకు పాల్పడిన ఈ బ్యాచ్‌ను పోలీసులు పట్టుకున్నారు. వీరిలో మాజీ సైనికుడు కీలక నిందితుడు కాగా, రెక్కీ వేసింది అతని తండ్రి, సహకరించింది బాల్యమిత్రుడే కావడం విశేషం. వారి వద్ద నుంచి రూ.7.70 లక్షల విలువ గల 11 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో 4.5 తులాలు స్వాధీనం కాబోతోంది. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం మీడియాకు ఈ కేసు వివరాలు వెల్లడించారు. నిందితులు మెళియాపుట్టి మండలం గొప్పిలికి చెందిన బసవ కిరణ్‌కుమార్, అతని తండ్రి బసవ రాజ్‌గోపాల్, మిత్రుడు బండారు ఉమామహేశ్వరరావు, విశాఖకు చెందిన మర్రివలస సంధ్య అని తెలిపారు.

ఇలా దొరికారు..
ఈ నెల 5న పలాస కొత్తవీధిలో ఒంటరిగా నివాసముంటున్న మహిళ ఇంటికి రాజగోపాల్, కిరణ్ వెళ్లి.. తిరుమల ఉన్నాడా అని అడిగారు. ఆమె తలుపు తీసిన వెంటనే దాడి చేసి కత్తితో బెదిరించారు. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలించి కొద్దిదూరంలో బండిపై ఉన్న ఉమామహేశ్వరరావుతో కలిసి ఆ రోజు పారిపోయారు. ఈ నెల 10న విశాఖపట్నం వద్ద ఉన్న మరో నిందితురాలు సంధ్య వద్దకు వెళ్లి తనఖా వేసేందుకు బయల్దేరగా కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డారు.

కీలక నిందితుడు ఓ మాజీ సైనికుడు..
ఈ చోరీల్లో కీలక నిందితుడైన కిరణ్‌కుమార్ ఆర్మీలో టెక్నికల్ విభాగంలో పనిచేసి 2023లో ఉద్యోగం మానేశాడు. విధుల్లో ఉన్నప్పటి నుంచే ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడేవాడు. ఆ పిచ్చితోనే రూ.30 లక్షల వరకు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. తన బాల్యమిత్రుడైన ఉమామహేశ్వరరావు కూడా ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనపరుడే కావడంతో ఇద్దరూ కలిసి దొంగతనాలు మొదలుపెట్టారు. ఉమామహేశ్వరరావుపై ఇదివరకే మెళియాపుట్టిలో నిందితునిగా 2021లో కేసు ఉంది.

11 తులాల బంగారం రికవరీ..
నలుగురిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. వారి వద్ద నున్న 11 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని, మిగతా 4.5 తులాలు బరంపురం మణప్పురంలో ఉన్నందున నోటీసులిచ్చామని రికవరీ అవుతుందని తెలిపారు. బ్యాంకులకు, ముథూట్, మణప్పరం, ఇతర ఫైనాన్స్ కంపెనీలకు ఎవరైనా బంగారు వస్తువులు తనఖా నిమిత్తం తెచ్చేటప్పుడు డాక్యుమెంట్లు ఒకటికి రెండుసార్లు చూసుకోవాలన్నారు.

ప్రతిభకు ప్రశంసలు
మూడు కేసులను తమ పర్యవేక్షణలో చాకచక్యంగా ఛేదించిన అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావును, కాశీబుగ్గ సీఐ దాడి మోహనరావు, సోంపేట సీఐ బి.మంగరాజు, ఎస్ఐ బి.హైమావతి, హెచ్‌సీ గవరయ్య, షన్ముఖరావు, కూర్మారావు, ప్రసాద్, ఉషాకిరణ్, ప్రదీప్, కిరణ్‌కుమార్, కామేష్, ఈశ్వరరావులను ఎస్పీ అభినందించారు.

ఈ చోరీలన్నీ వీరివే..

- గత నెల 16న కిరణ్‌కుమార్ కాశీబుగ్గ శివాజీనగర్‌లో ఒంటరిగా ఇంట్లో ఉన్న ఓ మహిళ వద్దకు వెళ్లి అడ్రస్ అడిగినట్టు నటించి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెల తాడు, తులం లాకెట్ చెయిన్ తెంపుకుపోయారు.
- ఈ చోరీకి ముందు రాజ్‌గోపాల్ ఇంటిని రెక్కీ చేయడం విశేషం. దొంగిలించిన సొత్తును గత నెల 17న ఉమామహేశ్వరరావు విశాఖపట్నం ఎంవీపీ కాలనీకి చెందిన మహిళ మర్రివలస సంధ్యకు అదే ప్రాంతంలో ఉన్న ముథూట్ మినీ ఫైనాన్షియర్స్ లిమిటెడ్‌లో తనఖా పెట్టమన్నారు. లోన్ పెట్టగా వచ్చిన సొమ్ము రూ. 2.10 లక్షలలో రూ. 20 వేలు సంధ్య ఉంచుకుని మిగతా సొమ్మును కిరణ్‌కు ఇచ్చింది.
- గత నెల 25న సోంపేట దినమహదేవపురంలో తండ్రీ కొడుకులైన రాజగోపాల్, కిరణ్‌లు ఒంటరిగా ఉన్న మహిళను ఇలానే బెదిరించి నల్లపూసల తాడు తులంపావు, పుస్తెల తాడు తులంపావు తెంపుకొని పోయారు. అదే రోజు ఉమామహేశ్వరరావు పేరుమీద బరంపురంలోని మణప్పురంలో రూ.1.24 లక్షల తనఖా లోను అంతా సమానంగా పంచుకున్నారు.